నేడు డయల్ యువర్ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని టీజీఎస్ఆర్టీసీ మెహిదీపట్నం డిపో మేనేజర్ బి.వి.కె.మూర్తి తెలిపారు. ప్రయాణికుల సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. క్రమం తప్పకుండా తాము నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రయాణికులు, వ్యాపారులు, కాలనీ సంక్షేమ సంఘాల నుంచి మంచి స్పందన వస్తుందని ఆయన అన్నారు. తమకు వస్తున్న సలహాలు, సూచనలను పరిశీలించి వివిధ రూట్‌లలో కొత్త బస్సు సర్వీసులు వేయడంతో పాటు పలు రూట్‌లలో బస్సు సర్వీస్ సంఖ్యను పెంచడం జరుగుతుందన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959226133లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో నేడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి నరపల్ సింగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ ప్రైవేటు సంస్థల్లోని 100 ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియేట్, డిగ్రీ అర్హత కలిగి ఉండి 18 ఏళ్లు పైబడిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి వారి విద్యార్హత నైపుణ్యాన్ని అనుసరించి చక్కటి జీతభత్యాలతో పాటు ఇతర ఇన్సెంటీవ్స్ ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు విజయనగర్ కాలనీలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కార్యాలయంలో ఫొటోలు, సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 83284 28933లో సంప్రదించవచ్చు.

తెలంగాణలో బీజేపీకి ప్రజాదరణ



గోల్కొండ: తెలంగాణలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కూ పడుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి అన్నారు. గురువారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీకి ప్రజాదరణ రోజు రోజుకూ పెరుగుతోందన్నారు. ఉత్తుత్తి హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎక్కువ కాలం ఉండజాలదని ఆమె అన్నారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడమే బీజేపీ లక్ష్యమన్నారు. ఆమెను కలిసిన వారిలో కార్వాన్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఉద్దడి జగదీష్‌కుమార్ తదితరులున్నారు.

కమిషనర్‌ను కలిసిన నగేశ్



చాంద్రాయణగుట్ట: నూతనంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులైన ఆర్.వి.కర్ణన్‌ను గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు బోయ నగేశ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆయన కమిషనర్‌ను కోరారు.

జోరుగా తాటి ముంజల అమ్మకాలు



గోల్కొండ: శరీరానికి చల్లదనాన్ని ఇచ్చే తాటి ముంజల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గుడిమల్కాపూర్, కార్వాన్, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో నేరుగా చెట్టు నుంచి కోసి తెచ్చిన తాటి ముంజలను అమ్ముతున్నారు.

పూడికతీత పనులు చేపట్టాలి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో వర్షపు నీటి పైప్‌లైన్‌లకు పూడికతీత పనులు చేపట్టాలని నియోజకవర్గం గుడ్ గవర్నెన్స్ కమిటీ వారు బల్దియా జోనల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు కమిటీ ప్రతినిధులు గురువారం జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధి, బీజేపీ నాయకుడు జొన్నకుంటి మధుసూదన్ మాట్లాడుతూ..వరద నీటి పైప్ లైన్‌లు పూడికలతో నిండిపోయాయన్నారు. దీంతో లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారులపై సైతం డ్రైనేజీ నీరు ప్రవహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మనీష్, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్ తదితరులున్నారు.

పబ్లిక్ బోర్లకు మరమ్మతులెన్నడో?

- అధ్వానంగా పబ్లిక్ బోర్ల నిర్వహణ
- నిరుపయోగంగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



గోల్కొండ ఖాజీగల్లీలో నిరుపయోగంగా చేతి పంపు



మెహిదీపట్నం హసన్ కేఫ్ వద్ద..



బడాబజార్‌లో..

గోల్కొండ: ప్రజల నీటి కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి పబ్లిక్ బోర్లు (చేతి పంపులు) వేసింది. నిరుపేదలు, మురికి వాడల ప్రజలకు ఈ పబ్లిక్ బోర్లు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. పలుచోట్ల రోడ్ల పక్కనే ట్యాంకులు ఏర్పాటు చేసి విద్యుత్ మోటార్ల ద్వారా ట్యాంకులను నింపే వారు. రాను రాను వీటి నిర్వహణ పూర్తిగా మరిచారు. మరికొన్ని చోట్ల చేతి పంపులు విరిగిపోవడం, పని చేయకపోవడం లాంటి కారణాలతో పబ్లిక్ బోర్లు వృథాగా ఉంటున్నాయి. కబ్జాదారులు పనిచేయని బోర్ల విడిభాగాలను గుట్టు చప్పుడు కాకుండా మాయం చేసేశారు. కార్వాన్, లంగర్‌హౌస్, గోల్కొండ, నానల్‌నగర్ డివిజన్‌లలో ఇప్పటికే ఎన్నో చేతి పంపులు కనపడకుండాపోయాయి. మెహిదీపట్నం, టోలిచౌకీ చౌరస్తా తదితర ప్రాంతాల్లో బోరు పంపుతో పాటు పైపులను కూడా గాయబ్ చేసేశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

నిర్వహణ గాలికి..

పబ్లిక్ బోర్ల నిర్వహణను ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో మెహిదీపట్నం, అహ్మద్‌నగర్, గోల్కొండ ఖాజీగల్లీ, టోలిచౌకీ చౌరస్తా తదితర ప్రాంతాల్లోని బస్తీల్లో ఏర్పాటు చేసిన పబ్లిక్ బోర్లు కనుమరుగయ్యాయి. మెహిదీపట్నం హసన్ కేఫ్ వద్ద కేఫ్ యజమాని పబ్లిక్ బోరును పూర్తిగా తొలగించి ఆ స్థానంలో పాన్ డబ్బాను ఏర్పాటు చేసి అద్దెకు ఇచ్చుకున్నాడు. గోల్కొండ బడాబజార్‌లో సైతం పబ్లిక్ బోరు కానరాకుండాపోయింది. పబ్లిక్ బోర్ల పునరుద్ధరణకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి వాటిని పునః ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి..



వేసవిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. అధికారులు ప్రజలకు సరిపడా నీరు అందించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నిరుపేద బస్తీల ప్రజలు పబ్లిక్ బోర్లపైనే ఆధారపడి ఉంటున్నారు. పాడైన పబ్లిక్ బోర్లకు మరమ్మతులు చేయాలి.

– జొన్నకుంటి మధుసూదన్, గుడిమల్కాపూర్

కొత్త బోర్లు వేయాలి..



నీటి కొరత తీవ్రంగా ఉంది. నల్లాలో వస్తున్న నీరు సరిపోవడం లేదు. అక్బర్‌పురా, టోలిచౌకీలలో ఉన్న పబ్లిక్ బోర్లు పూర్తిగా పాడయ్యాయి. వీటికి మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. నిరుపేద బస్తీల్లో కొత్త పబ్లిక్ బోర్లు వేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

– అశోక్‌కుమార్, టోలిచౌకీ

అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి



నిరసన తెలియజేస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు పిల్లి రాంచందర్ తదితరులు

చార్మినార్: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డిపై ఏపీ ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తూ వేధింపులకు గురి చేయడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు పిల్లి రామచందర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని సాక్షి కార్యాలయంలో ప్లకార్డులు పట్టుకొని ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగే విధంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. నిజాన్ని నిర్భయంగా.. వాస్తవాలను పత్రిక ద్వారా పాఠకుల కళ్ల ముందుంచుతున్న సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేయడం సరైనది కాదన్నారు. గతంలో కూడా సాక్షిపై అప్పటి ప్రభుత్వం కక్ష కట్టి చేసిన కక్ష సాధింపులను జర్నలిస్టులతో పాటు పాఠకులు తిప్పి కొట్టారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌యూజే సంయుక్త కార్యదర్శి పెండ్యాల లక్ష్మణరావు, కార్యవర్గ సభ్యులు టంగుటూరి రాజేష్‌కుమార్, షేక్ అలీ, విలేకర్లు జలీల్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

భారత సైనికులకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ



ర్యాలీలో నిర్మల్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: భారత సైనికులకు మద్దతుగా గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. గోషామహల్ నుంచి నెక్లెస్ రోడ్డు వరకు కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున ప్రదర్శన చేశారు. పాకిస్తాన్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం ఎంతో గర్వకారణమన్నారు. పాకిస్తాన్‌కు బుద్ధి చెబుతున్నా పాకిస్తాన్‌లో మార్పు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నర్మద సింగ్, రమేష్ కుమార్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డిని తరలిస్తున్న డీసీఎంలో మంటలు



సంతోష్‌నగర్: డీసీఎం వాహనంలో పశువుల దాన (వరిగడ్డ)ను తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగిన ఘటన గురువారం సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ ఈదిబజార్ బన్నాక మీదుగా గురువారం తెల్లవారుజామున 3.50 గంటల సమయంలో ఓ డీసీఎంలో డ్రైవర్ వరిగడ్డిని తీసుకెళ్తున్నాడు. కాగా అదే సమయంలో స్థానికంగా ఉన్న విద్యుత్ తీగలకు వరిగడ్డి తగలడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. అంతే కాకుండా అక్కడే స్థానికంగా సయ్యద్ జలీల్ అహ్మద్ అనే వ్యక్తి తన మహేంద్ర మారోజోను పార్కు చేయగా మంటలు దానికి వ్యాపించాయి. దీంతో వాహనం స్వల్పంగా ధ్వంసమైంది. దీనిపై బాధితుడు సయ్యద్ జలీల్ సంతోష్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కళాశాలల్లో తెలుగును తప్పనిసరి చేయాలి

సుల్తాన్‌బజార్: నానాటికి విద్యారంగంలో మాతృభాషపై నిరాదరణ, ఆంగ్ల ఆధిపత్యం పెరిగిపోతున్న నేపథ్యంలో 82 ఏళ్ల కింద మాతృభాష తెలుగు పరిరక్షణే ప్రథమ కర్తవ్యంగా ఆవిర్భవించిన తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు ఆమోదించింది. ఇంటర్మీడియెట్‌లో సంస్కృతాన్ని ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను విరమించుకోవడమే కాకుండా ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో తెలుగును తప్పనిసరి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 10వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తెలుగును తప్పనిసరి అధ్యయనాంశంగా జీఓ నెంబరు:15 ప్రకారం కచ్చితంగా అమలు చేస్తున్నట్లే ఇంటర్‌లో కూడా తెలుగును తప్పనిసరి చేయాలని కోరింది. పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య సమన్వయ కర్తగా వ్యవహరించారు. ముదిగొండ సుజాతారెడ్డి, నరహరి, డాక్టర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి, రామారావు, వసుంధర, కృష్ణమాచార్య, వెంకటయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, సిల్మానాయక్ పాల్గొన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు చేయరా?



బురదమయంగా మారిన రోడ్డు

మణికొండ: మున్సిపాలిటీకి సకాలంలో పన్నులు చెల్లించినా తమ కాలనీకి కనీస సౌకర్యాలను కల్పించటంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలం అవుతున్నారని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలోని అన్ని రోడ్లలలో నివాసాలను ఏర్పాటు చేసుకుని ప్రజలు జీవిస్తున్నారు. వారికి కనీస అవసరాలైన రోడ్లు, వీధి దీపాలు, మురుగునీటి కాలువల నిర్మాణం, మంచి నీటి సౌకర్యం కల్పించటం లేదని శ్రీనాథ ఎక్లేవ్, కోరల్ రెసిడెన్సీ, గోల్డెన్ కీ, మణికంఠ రెసిడెన్సీ, ఆర్ 7 ఇన్నా, ఆరక రెసిడెన్సీ, రాజరాజేశ్వర రెసిడెన్సీ, డీఎఫ్ అపార్ట్‌మెంట్‌వాసులు వాపోతున్నారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఇంటి పన్నులు చెల్లిస్తున్నా తమకు సౌకర్యాలు ఎందుకు కల్పించరని ప్రశ్నిస్తున్నారు. ప్రజలు తిరగని కాలనీల్లో రోడ్లు, ఇతర సౌకర్యాలన్నీ కల్పిస్తున్న అధికారులు, ప్రజలు నివసిస్తున్న వాటిని ఎందుకు పట్టించుకోరని వారు నిలదీస్తున్నారు. అనేక సార్లు మున్సిపల్ కమిషనర్‌కు రాతపూర్వక ఫిర్యాదులు చేసినా చలనం లేదని, ఇకనైనా స్పందించి రోడ్లను ఏర్పాటు చేయాలన్నారు. లేదంటే మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ భోర్కడేను కోరారు.గురువారం జోనల్ కార్యాలయంలో ఆయనను కలిసి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను వివరించారు. అంతేకాకుండా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని కోరారు. గచ్చిబౌలి డివిజన్‌లో చెరువుల అభివృద్ధి, పార్కుల నిర్వహణ, రోడ్ల మరమ్మతులు వంటి అంశాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మౌలిక వసతులు మెరుగుపర్చడంలో పూర్తిగా సహకరించాలని కోరారు.

జన్మదిన శుభాకాంక్షలు

చార్మినార్: హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పాతబస్తీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బహదూర్‌పురా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్, చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముజీబ్ ఉల్లా షరీఫ్ తదితరులు ఆయనను కలిసి బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

చాంద్రాయణగుట్ట: హైదరాబాద్ ఇన్‌చార్జి, మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినోత్సవం సందర్భంగా ఆయనను గురువారం చాంద్రాయణగుట్ట చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్ గౌడ్ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.



చార్మినార్‌లో..



చాంద్రాయణగుట్టలో..

భక్తిశ్రద్ధలతో శివలింగ ప్రతిష్ఠాపనోత్సవం



జియాగూడ: లక్ష్మీ నర్సింహనగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయంలో గురువారం ఉదయం శివలింగం ప్రతిష్ఠాపనోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఆలయ 25 ఏళ్ల మహోత్సవ వేడుకలు ప్రారంభం కాగా చివరి రోజున ఆలయంలో శివలింగం ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. అనంతరం అఖండ హారతి, ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున హాజరై మాతేశ్వరీని, శివలింగాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు ఎం.శ్రీకాంత్, జి.మదన్ మోహన్, అర్చకులు సేనాపతి, వంశీకృష్ణమాచార్యులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నాంపల్లి: పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మాసబ్‌ట్యాంక్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 1800 బియ్యాన్ని, 405 కేజీల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం..బంజారాహిల్స్ రోడ్ నెం-12 గోలానగర్‌కు చెందిన మహ్మద్ యాసిర్(23), బిహార్‌కు చెందిన లలిత్‌కుమార్ (22) కాటేదాన్‌లో నివాసం ఉంటున్నారు. ప్రజా పంపిణీకి చెందిన సన్న బియ్యం, గోధుమలను అక్రమంగా బంజారాహిల్స్ నుంచి కాటేదాన్‌కు తరలిస్తున్నారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా బియ్యాన్ని, గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా తాము పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లుగా ఒప్పుకున్నారు. వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

నాంపల్లి: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన నాంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని టూవీలర్ పార్కింగ్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సుమారు 50–55 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తుతెలియని వ్యక్తి గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీనికి తోడు వడదెబ్బ సోకింది. పరిస్థితి విషమించడంతో బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై నీలం రంగు చొక్కా, అదే రంగు లుంగీ ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి అక్రమ వ్యాపారానికి చెక్

గోల్కొండ: టోలిచౌకీ ఎండిలైన్స్ శాతం పహాడ్ బస్తీలో అక్రమంగా నీటి వ్యాపారం కొనసాగిస్తున్న ఓ బోర్‌ను అధికారులు సీజ్ చేశారు. నదీమ్ కాలనీని ఆనుకొని ఉన్న శాతం చెరువు ఎగువ ప్రాంతంలో శాతం పహాడ్ బస్తీ ఉంది. అయితే స్థానికంగా ఉండే ఓ వ్యక్తి తమ ఇంటి వద్ద బోరు వేసుకొని ట్యాంకర్ల ద్వారా అక్రమంగా నీటి వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఈ బోరు నుంచి ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ట్యాంకర్లతో నీరు తోడడం వల్ల శాతం పహాడ్ బస్తీలోని ఇతర బోర్లల్లో నీటి చుక్క లేకుండాపోయింది. దీంతో స్థానికులు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ దృష్టికి తెచ్చారు. ఆయన సూచనల మేరకు గోల్కొండ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజల ఫిర్యాదు స్వీకరించిన తహసీల్దార్ తన సిబ్బందితో శాతం పహాడ్‌కు వచ్చి బోరును సీజ్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్‌లను ప్రారంభిస్తున్న బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

శాలిబండ: బహదూర్‌పురా నియోజకవర్గంలోని చందులాల్ బారాదరి సెక్షన్‌లో ఆరు కొత్తగా ఏర్పాటు చేసిన 160 కేవీఏ కెపాసిటీ కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ ప్రారంభించారు. నియోజకవర్గంలోని రామ్నాస్‌పురా డివిజన్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, దూద్‌బౌలి డివిజన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఖాదర్, సలీం, మజ్లిస్ పార్టీ నాయకులు, విద్యుత్ శాఖ ఏడీఈ వెంకటేశ్‌గౌడ్, ఏఈ మహమ్మద్ షబ్బీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలను కలిసికట్టుగా నిర్వహించుకుందాం

లంగర్‌హౌస్: రాబోయే పండుగలను కలిసికట్టుగా నిర్వహించుకుందామని లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాములు అన్నారు. కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బి–బ్లాక్ అధ్యక్షుడు కె.చంటిబాబు ఆధ్వర్యంలో గురువారం లంగర్‌హౌస్ నూతన ఇన్‌స్పెక్టర్ వెంకటరాములును కలిశారు. ఈ సందర్భంగా చంటిబాబు తాము పీస్ అండ్ మైత్రీ కమిటీ ద్వారా కూడా చేస్తున్న సేవలను వివరించారు. రాబోయే ప్రధాన పండుగల గురించి వివరించారు. అల్ హజ్రి, శ్రీరాములు, పి.శ్రీనివాస్‌రావు, శోభా పాండె, సంతోష్‌గౌడ్, శ్రీకాంత్, అలిం ఉన్నారు.



లంగర్‌హౌస్ ఎస్‌హెచ్‌ఓను కలిసిన చంటిబాబు తదితరులు

ఉపాధ్యాయుల సమ్మేళనాలు | స్నేహ భావాలను పెంపొందిస్తాయి



మాట్లాడుతున్న కళాశాల కార్యదర్శి జగన్మోహన్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, సిబ్బంది

అఫ్జల్‌గంజ్: ఉపాధ్యాయుల కుటుంబ సమ్మేళనాలు స్నేహ భావాలను పెంపొందిస్తాయని స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి ఎస్.జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులు వారి కుటుంబసభ్యులు, సిబ్బంది, పలు బహుళజాతి సంస్థలతో సమ్మేళన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ..తమ కళాశాలలో నాణ్యమైన విద్యను బోధిస్తూ విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నట్లు అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గిరిధర్ ఆకుల మాట్లాడుతూ..ఫ్యామిలీ గెట్ టు గెదర్ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులకు, సిబ్బందికి, అధ్యాపకులకు ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. అందరి మధ్య ఆత్మీయత, స్నేహభావాలు పెంపొందుతాయన్నారు. ఈ సందర్భంగా పలు క్రీడలు సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలను తొలగించండి



వాకర్స్‌కు అడ్డంకిగా మారిన చెట్ల కొమ్మలు

నాంపల్లి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షం, ఈదరుగాలులకు పబ్లిక్ గార్డెన్స్‌లోని చెట్లు నేలకొరిగాయి. ఈ చెట్ల కొమ్మలు వాకర్స్ నడిచే లాన్ల మీద పడ్డాయి. పబ్లిక్‌గార్డెన్స్‌కు ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది మంది వాకర్స్ వస్తుంటారు. వాకింగ్ కోసం వచ్చే వాకర్స్‌కు చెట్ల కొమ్మలు అడ్డంకిగా మారాయి. సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. పబ్లిక్‌గార్డెన్స్‌లో వర్షానికి, ఈదురుగాలులకు కూలిన చెట్లను వెంటనే తొలగించాలని వాకర్స్ డిమాండ్ చేస్తున్నారు.

జీడీఏఐ, సర్వీసెస్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ మధ్య ఒప్పందం

అఫ్జల్‌గంజ్: భారత గేమ్ డెవలపర్స్ అసోసియేషన్ (జీడీఏఐ), సర్వీసెస్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ మధ్య వ్యూహాత్మక ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ఒప్పంద వివరాలను అభయ్‌కుమార్ సిన్హా, శ్రీధర్ ముప్పిడి గురువారం వివరాలు వెల్లడించారు. గేమింగ్ ఈ స్పోర్ట్స్, ఇతర టెక్నాలజీల సహకారంతో ఈ స్పోర్ట్స్ రంగంలో సహకారం ఆవిష్కరణలు చేపట్టే విధంగా కృషి చేస్తామన్నారు. దేశ సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న రామకృష్ణ

గచ్చిబౌలి: వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ తీసుకుంటే మహిళలు స్వయం ఉపాధికి అవకాశం ఉంటుందని టీజీఎస్పీ కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణ పేర్కొన్నారు. కొండాపూర్ బెటాలియన్‌లో జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో వివిధ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రెస్ మేకింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ తీసుకున్న వారికి స్వయం ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కొండాపూర్ బెటాలియన్ క్యాంపస్‌లో చేపడుతున్న శిక్షణ తరగతులను సమీప ప్రాంతాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ్ సంస్థాన్ డైరెక్టర్ రాంమోహన్, కమాండెంట్ సతీమణి సంధ్యారాణి పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9989616273